సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం, 16, అక్టోబర్, 2025



‘ఉపాధి’తో పశువుల షెడ్లు..
ఉపాధి పథకం ద్వారా పశువుల షెడ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించగా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. 10లో



బీసీ బిల్లు ఆమోదించాలి
రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వెంకట్ కోరారు. 10లో

గరిష్టం / కనిష్టం
31° / 23°

వాతావరణం
జిల్లాలో గురువారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. తెల్లవారుజామున, రాత్రి వేళల్లో కొంత చల్లి ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితరపూజలు చేశారు. అనంతరం చిత్రకూట మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

అన్నవరం, పంచారామాలకు ప్రత్యేక బస్సులు
చుంచుపల్లి: కార్తీకమాసాన్ని పురస్కరించుకొని కొత్తగూడెం పరిసర ప్రాంత భక్తుల సౌకర్యార్థం కొత్తగూడెం, పాల్వంచ నుంచి అన్నవరం, పంచారామాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నవరానికి డీలక్స్ బస్సు, పంచారామాలైన అమరావతి, భీమవరం, ద్రాక్షారామం, పాలకొల్లు, సామర్లకోటకు సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 26 నుంచి ప్రత్యేక బస్సులు బయలుదేరుతాయని తెలిపారు. వివరాలకు 90103 74644 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వినియోగదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న వేణుగోపాలాచారి

కొత్తగూడెంఅర్బన్: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యమని సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఎస్.వి. వేణుగోపాలాచారి అన్నారు. సుజాతనగర్ సబ్ స్టేషన్ ఆవరణలో బుధవారం నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో ఆయన ఫిర్యాదులు స్వీకరించాక మాట్లాడారు. వినియోగదారులు తమ సమస్యలను మొబైల్ లేదా వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. సమస్యలు తెలుసుకుని సత్వరం వాటిని పరిష్కరించేందుకే గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాగా, వర్షాకాలంలో లూజ్ లైన్లతో ప్రమాదం పొంచి ఉంటుందని, అలాంటి సమస్యలు ఉన్న చోట సరిచేయాలని అధికారులకు సూచించారు. సీజీఆర్ఎఫ్ టెక్నికల్ మెంబర్ కె.రమేష్, మెంబర్(ఫైనాన్స్) ఎన్.దేవేందర్, ఇండిపెండెంట్ మెంబర్ ఎం.రామారావు, ఎస్ఈ మహీందర్, డీఈ రంగస్వామి, ఏడీఈ రవికుమార్, ఏఈలు నరసింహారావు, కిషన్ పాల్గొన్నారు.

వేతనాల కోసం ధర్నా
అశ్వాపురం: అటవీ శాఖ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ పద్ధతిన పని చేస్తున్న సిబ్బంది వేతనాలు చెల్లించాలంటూ అటవీ శాఖ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతేడాది కాలంగా వేతనాలు రాక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని, అశ్వాపురం రేంజ్, ఎఫ్‌డీఓ, డీఎఫ్ఓ కార్యాలయాల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా తమ సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం వేతనాలు చెల్లిస్తామని అటవీ శాఖ కార్యాలయానికి పిలిపించారని, అయినా జీతాలు ఇవ్వకపోవడంతో ఆందోళన చేయాల్సి వచ్చిందని వివరించారు.

అధిక పర్మిట్లు.. ప్రజలకు ఇక్కట్లు

ఇష్టారీతిగా అనుమతులు జారీ చేస్తున్న టీజీఎండీసీ
- ఫలితంగా సామర్థ్యానికి మించి లారీల రాకపోకలు
- భారీ లోడ్‌తో దెబ్బతింటున్న రహదారులు
- దుమ్ము, ధూళితో పాటు పదే పదే ట్రాఫిక్ జామ్



సామర్థ్యానికి మించి పర్మిట్లు ఇవ్వడంతో భద్రాచలం - చర్ల మార్గంలో బారులుదీరిన లారీలు



ఇసుక లారీలతో దెబ్బతిన్న రోడ్డు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలోని దుమ్ముగూడెం, చర్ల, అశ్వాపురం, మణుగూరు, బూర్గంపాడు సహా అనేక మండలాలు షెడ్యూల్ 5 పరిధిలో ఉన్నాయి. పీసా చట్టాలను అనుసరించి ఇక్కడ ఇసుక రీచ్‌లను గిరిజనులే నిర్వహిస్తూ సొసైటీల ద్వారానే విక్రయించాలి. ఈ క్రమంలో యంత్రాలను వినియోగించకూడదు. అయితే సీతమ్మసాగర్ – కాటన్ ఆనకట్టల ఎగువ భాగంలో డీ సిల్టేషన్ పేరుతో 30 ఇసుక రీచ్‌లకు అనుమతుల జారీతో కోటి క్యూబిక్ మీటర్ల ఇసుకను అమ్ముకునే వెసులుబాటు కలిగింది. డీ సిల్టేషన్ పేరిట మైనింగ్‌కు అనుమతి ఇవ్వడంతో పీసా చట్టం పరిధి నుంచి మినహాయింపు లభించింది. అసలు నిర్మాణమే జరగని సీతమ్మసాగర్ బరాజ్ కింద డీ సిల్టింగ్‌కు అనుమతులు ఇవ్వడంపై ఇప్పటికే విమర్శలు వస్తుండగా కొందరు న్యాయస్థానాలను ఆశ్రయించారు. దీంతో ఏ క్షణమైనా గోదావరి తీరం వెంబడి డీ సిల్టింగ్ కోసం జారీ చేసిన అనుమతులు రద్దవుతాయనే ప్రచారం సాగుతోంది. ఈ క్రమంలోనే అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు వస్తున్నాయి.

లెక్కకు మించి పర్మిట్లు..

డీ సిల్టేషన్ ప్రక్రియపై విమర్శలు, వివాదాలు కొనసాగుతున్నందున అందుబాటులో ఉన్న కొద్ది సమయంలోనే ఎక్కువ ఇసుక తోడేయాలని, అలా తోడిన ఇసుకను వెంటవెంటనే అమ్ముకోవాలనే టీజీఎండీసీ ఆరాటం గోదావరి తీరం వెంట ఉన్న ప్రజలకు నరకం చూపిస్తోంది. ఇక్కడి ఇసుక ర్యాంపుల నుంచి లెక్కకు మించి పర్మిట్లు జారీ చేసింది. దీంతో 24 గంటలూ భారీ లారీలు ఈ మార్గం గుండా రాకపోకలు సాగిస్తున్నాయి. భద్రాచలం నుంచి చర్ల వైపు వెళ్లే లారీలు వంద ఉంటే.. చర్ల నుంచి భద్రాచలం వైపు వచ్చే లారీలు అంతే సంఖ్యలో ఉంటున్నాయి. 60 కి.మీ. నిడివి కలిగిన రహదారి మొత్తం అటూ ఇటు ఇసుక లారీలతోనే నిండిపోతోంది. సామర్థ్యానికి మించి ఇసుక తరలించే లారీలతో రహదారి మొత్తం అడుగుకో గుంతగా మారింది. ఇక రాకపోకలకు స్థానికులు ఇక్కట్లు ఎదుర్కొంటుండగా, ప్రధాన రహదారి ఎక్కాలంటేనే హడలిపోవాల్సిన పరిస్థితి నెలకొంది. రహదారికి ఇరువైపులా ఇళ్లు ఉన్న వారికైతే ప్రత్యక్ష నరకం కనిపిస్తోంది. ఇది చాలదన్నట్టు గత శనివారం సాయంత్రం ఇసుక లారీలు గుంతలో కూరుకుపోవడంతో దాదాపు 12 గంటల పాటు ట్రాఫిక్ జామ్ అయింది. వెంకటాపురం నుంచి భద్రాచలం వచ్చే ఆర్టీసీ బస్సులు అర్ధరాత్రి వేళ అడవిలో నిలిచిపోయి మహిళలు ఇబ్బంది పడ్డారు.

విమర్శలు రావడంతో..

ఇసుక లారీలు సృష్టిస్తున్న ఇబ్బందులతో గోదావరి తీరంలోని గ్రామాల నుంచి తీవ్ర వ్యతిరేకత పెల్లుబికింది. ఎక్కడికక్కడ లారీలను అడ్డుకునేందుకు యువత సిద్ధమయ్యారు. పరిస్థితి చేజారుతోందని గ్రహించిన టీజీఎండీసీ దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. భారీ వర్షాలతో రోడ్లు పాడైపోయిందున ఈనెల 13, 14 తేదీల్లో పర్మిట్ల జారీని నిలిపేసింది. దీంతో గత సోమవారం లారీల తాకిడి తగ్గింది. అప్పటికే పర్మిట్లు జారీ అయిన లారీలే రాకపోకలు సాగించాయి. తిరిగి బుధవారం నుంచి పర్మిట్లు జారీ చేయగా.. మళ్లీ గురువారం నుంచి పరిస్థితి ఎలా ఉంటుందోనని స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

అక్రమాలపై నజరేది ?

ఇసుక లారీలతో వేలాది మంది ప్రజల ఇబ్బందులను జిల్లా అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. రీచ్‌ల దగ్గర జరిగే అవినీతి వైపు కన్నెత్తి చూసేవారే కరువయ్యారు. ఒకే లారీకి జారీ అయిన పర్మిట్(డీడీ)ని కలర్ జిరాక్స్ తీసి అనేక లారీలు ఉపయోగిస్తున్న వైనం ఇటీవల వెలుగు చూసింది. రీచ్‌ల దగ్గర సీరియల్ పేరిట ఒక్కో లారీ నుంచి రూ.3వేల నుంచి రూ.5వేల వరకు వసూలు చేస్తున్నట్లు వెల్లడైంది. ఇలా అక్రమంగా వసూలు చేసిన సొమ్ములో ఎవరి వాటా వారికి వెళ్తోందనే ఆరోపణలు వస్తున్నాయి. అధిక పర్మిట్ల జారీ, నకిలీ పర్మిట్లు, సీరియల్ పేరిట అక్రమ వసూళ్ల వంటి అంశాలపై వివరణ కోరేందుకు టీజీఎండీసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ శంకర్‌నాయక్‌తో ఫోన్‌లో మాట్లాడేందుకు పలుమార్లు ప్రయత్నించినా ఆయన అందుబాటులోకి రాలేదు.

‘బీఎస్ఎన్ఎల్’ను అందుబాటులోకి తేవాలి

అధికారులకు కలెక్టర్ సూచన



బీఎస్ఎన్ఎల్ అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యార్థులు, ప్రజలు ఏ సమాచారమైనా క్షణాల్లో తెలుసుకునేలా అన్ని గ్రామాల్లో బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఇండియన్ టెలికం సర్వీసెస్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డి.భాస్కర్‌రావుతో పాటు అధికారులు కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా పాటిల్ మాట్లాడుతూ.. మండలానికి ఒక పంచాయతీని పైలట్ ప్రాజెక్టుగా ఎన్నుకొని నెట్‌వర్క్‌ను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేలా కృషి చేయాలని అన్నారు. మొబైల్ ఫోన్ నెట్‌వర్క్‌తో దేశంలో జరిగే ప్రతీ విషయాన్ని తెలుసుకోవచ్చని, తద్వారా యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని అన్నారు. కార్యక్రమంలో ఐటీఎస్ డైరెక్టర్ ఎం.అరవింద్, అసిస్టెంట్ డైరెక్టర్ జి.గణేష్‌కుమార్, ఏటీఎం జి. సుభాష్, ఎస్‌డీఈ సక్రు, ఎంఆర్డీవీ శివరాంజీ పాల్గొన్నారు.

రైజింగ్ విజన్ సర్వేలో పాల్గొనాలి

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ రైజింగ్ విజన్ – 2047 సర్వేలో ప్రతీ ప్రభుత్వ ఉద్యోగి పాల్గొనాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. రానున్న కాలంలో అభివృద్ధి, సంక్షేమం, విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, పరిశ్రమలు, ఐటీ, పర్యావరణ పరిరక్షణ రంగాల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెట్టేలా ప్రభుత్వం ‘తెలంగాణ రైజింగ్ విజన్ -2047’ డాక్యుమెంట్‌ను రూపొందిస్తోందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రూపొందిస్తున్న ఈ విజన్ పత్రం భవిష్యత్ తెలంగాణ అభివృద్ధికి మార్గదర్శకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈనెల 10న ప్రారంభమైన సర్వే 25వ తేదీ వరకు కొనసాగుతుందని వివరించారు. ఈ సర్వే ద్వారా ప్రభుత్వానికి వచ్చే ప్రజాభిప్రాయాలు భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలకు దిశానిర్దేశం చేస్తాయని తెలిపారు. సర్వేలో పాల్గొనేవారు https//www.telangana.gov.in లింక్ ద్వారా తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు.

ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు

ధాన్యం కొనుగోళ్లకు జిల్లాలో అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. ధాన్యం కొనుగోళ్లపై మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, అధికారులు బుధవారం సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా.. జిల్లా నుంచి కలెక్టర్ హాజరై మాట్లాడారు. జిల్లాలో 193 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా, సుమారు 2,38,177 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించే అవకాశం ఉందని వివరించారు. రైతులు ఇబ్బంది పడకుండా కేంద్రాల వద్ద తాగునీరు, విశ్రాంతి గదులు, తూకం యంత్రాలు, తేమ పరీక్ష పరికరాలు అందుబాటులో ఉంచామని తెలిపారు. ధాన్యం విక్రయించిన రైతులకు 48 గంటల్లోపే డబ్బు చెల్లించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. కొనుగోళ్లు పారదర్శకంగా సాగేందుకు జిల్లా అధికారులను అప్రమత్తం చేశామని తెలిపారు. వీసీలో అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందన, పౌరసరఫరాల అధికారి రుక్మిణి పాల్గొన్నారు.

కిన్నెరసాని ప్రాజెక్ట్ గేటు ఎత్తివేత



కిన్నెరసాని ప్రాజెక్టు గేటు ఎత్తడంతో దిగువకు ప్రవహిస్తున్న వరదనీరు

పాల్వంచరూరల్: ఎగువన కురుస్తున్న వర్షాలకు కిన్నెరసాని జలాశయంలోకి వరద కొనసాగుతోంది. 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన కిన్నెరసాని రిజర్వాయర్‌లోకి ఎగువ నుంచి 2,300 క్యూసెక్కుల వరదనీరు రావడంతో బుధవారం నీటిమట్టం 406.70 అడుగులకు పెరిగింది. దీంతో ప్రాజెక్టుకు చెందిన ఒక గేటును రాత్రి ఎత్తి ఉంచి 2 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

గంజాయి రహిత జిల్లాగా మారుద్దాం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్పీ తదితరులు

కొత్తగూడెంటౌన్: జిల్లాను గంజాయి రహితంగా మారుద్దామని ఎస్పీ రోహిత్‌రాజ్ పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల వినియోగంతో కలిగే దుష్ఫలితాలపై ఈనెల 15 నుంచి నవంబర్ 15 వరకు చైతన్యం పేరుతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను తన కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. గంజాయిని నివారించాలని, ఆ మత్తుకు బానిసై భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని అన్నారు. జిల్లాలో గంజాయి హాట్‌స్పాట్లలో నిత్యం తనిఖీలు చేపడుతున్నామని, మత్తు పదార్థాలు సేవిస్తూ పట్టుబడిన వారికి కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామని వివరించారు. గంజాయిని రవాణా చేస్తున్నట్లు లేదా వినియోగిస్తున్నట్లు గుర్తిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు, పాల్వంచ డీఎస్పీలు అబ్దుల్ రెహమాన్, చంద్రభాను, రవీందర్ రెడ్డి, సతీష్‌కుమార్, ఎస్‌బీ, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, రమాకాంత్, ఎస్సైలు ప్రవీణ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి అభివృద్ధికి సహకరించాలి

వీసీలో సీఎండీ బలరామ్ పిలుపు

కొత్తగూడెంఅర్బన్ : సింగరేణి సంస్థ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీఎండీ ఎన్.బలరామ్ పిలుపునిచ్చారు. భవిష్యత్‌లో వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 100 మిలియన్ టన్నుల దిశగా పయనించేందుకు అవసరమైన ప్రణాళికపై చర్చించేందుకు కొత్తగూడెంలోని ఇల్లెందు క్లబ్‌లో బుధవారం మేధోమథన కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేట్ పరిధిలోని జనరల్ మేనేజర్లు, డైరెక్టర్లు, ఉద్యోగ విరమణ పొందిన డైరెక్టర్లు హాజరు కాగా, సీఎండీ బలరామ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ప్రస్తుతం బొగ్గు రంగంలో ఉన్న పోటీని తట్టుకుని భవిష్యత్‌లో 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించడానికి, బొగ్గు ఉత్పత్తితో పాటు ఇతర రంగాల్లోకి సంస్థ విస్తరించేందుకు సలహాలు, సూచనలు అందించాలని కోరారు. సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ మాట్లాడుతూ.. భూగర్భ, ఉపరితల గనుల్లో బొగ్గు ఉత్పత్తి, థర్మల్, సౌర విద్యుత్ ఉత్పత్తి, సింగరేణి భవిష్యత్ ప్రణాళికల గురించి వివరించారు. సీపీపీ జీఎం ఎ.మనోహర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డైరెక్టర్(పీపీ) కె.వెంకటేశ్వర్లు, డైరెక్టర్(పా) గౌతమ్ పొట్రు, డైరెక్టర్(ఈఅండ్ఎం) ఎం.తిరుమలరావు, బి.వీరారెడ్డి, డి.ఎల్.ఆర్.ప్రసాద్, బి.రమేష్‌కుమార్, ఎ.భాస్కర్ రావు, వి.బాలకోటి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ కాకుంటే మిగిలేది ‘బూడిదే’!

కేటీపీఎస్ కాంప్లెక్స్‌లో నిండిన యాష్ పాండ్‌లు
- డంపింగ్ సమస్యతో నూతన ప్లాంట్ల నిర్మాణం కష్టమే ?
- నిల్వ ఉన్న బూడిదను బయటకు తరలిస్తేనే కొత్తవాటికి అవకాశం
- ఉచితంగా ఇస్తే తీసుకెళ్లేందుకు సిద్ధంగా పలువురు



పైపు ద్వారా చెరువులోకి చేరుతున్న బూడిద

పాల్వంచ: రాష్ట్రానికి వెలుగులు పంచే కేటీపీఎస్ కాంప్లెక్స్‌లో యాజమాన్యం అనాలోచిత చర్యలతో బూడిద చెరువులు నిండిపోయాయి. విద్యుత్ ఉత్పత్తి చేసే క్రమంలో బొగ్గు మండించగా వెలువడే బూడిదను పైప్‌లైన్ల ద్వారా యాష్ పాండ్‌కు తరలిస్తారు. అక్కడి నుంచి వివిధ రూపాల్లో బయటకు పంపించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే స్థానిక గిరిజనులకే బూడిద ఇవ్వాలనే డిమాండ్ వ్యక్తమైన నేపథ్యంలో ఇతర ప్రాంతాల వారికి తరలింపు చర్యలు మందగించాయి. యాష్ పాండ్‌కు పైప్‌లైన్ల ద్వారా బూడిద వస్తుంటే.. దాన్ని ఎప్పటికప్పుడు ఖాళీ చేయాల్సి ఉంటుంది. కానీ ఈ ప్రక్రియ కొంతకాలంగా నిలిచిపోవడంతో బూడిద చెరువులన్నీ పొంగిపొర్లుతున్నాయి. తద్వారా కాలుష్య సమస్య కూడా వస్తోందని పరిసర ప్రాంతాల వారు అంటున్నారు.

10 కోట్ల టన్నుల నిల్వ..

కేటీపీఎస్ కాంప్లెక్స్ పరిధిలో 5, 6, 7 దశల కర్మాగారాలు ఉండగా, 8, 9, 10, 11 యూనిట్ల ద్వారా మొత్తం 1,800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. ఈ క్రమంలో బొగ్గును మండించినప్పుడు భారీగా బూడిద వెలువడుతుంది. కేటీపీఎస్ 5, 6 దశలకు ఏబీ, ఏబీ అడిషనల్, 7వ దశకు నార్తర్న్1, నార్తర్న్ 2 యాష్‌పాండ్‌లు ఉండగా.. ఈ నాలుగూ నిండి పొంగిపొర్లుతున్నాయి. ప్రస్తుతం సుమారు 10కోట్ల టన్నుల యాష్ నిల్వలు పేరుకుపోయినట్లు అధికారుల అంచనా. ఇదిలా ఉండగా పలుచోట్ల కాల్వల్లో బూడిదను కలపడంతో పక్కనే ఉన్న కిన్నెరసాని జలాలు సైతం కలుషితం అవుతున్నాయి.

తరలించకుండా ఎత్తు పెంచడమా ?

యాష్ పాండ్‌లకు వదిలే బూడిదను ఖాళీ చేయించడంలో కొన్నేళ్లుగా యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తోంది. ఎప్పటికప్పుడు బూడిద తరలించకుండా రూ.కోట్ల వ్యయంతో చెరువు ఎత్తు పెంచే పనులు చేస్తున్నారు. దీంతో ఇప్పుడున్న బూడిద ఖాళీ చేయాలంటే సంవత్సరాల పాటు పట్టనుండగా.. అంతవరకూ కొత్త ప్లాంట్లు నిర్మించే అవకాశం లేదని తెలుస్తోంది. బూడిద తరలింపు ప్రక్రియపై ఇటీవల రాజకీయ జోక్యం పెరిగింది. బూడిదను బినామీ పేర్లతో సొసైటీలకు అప్పగించి తరలించే ప్రయత్నం చేశారు. అయితే స్థానిక గిరిజనులకే అవకాశం ఇవ్వాలని కొందరు కోర్టుకు వెళ్లగా తరలింపు ప్రక్రియ మందగించింది.

మూతబడిన చిన్న పరిశ్రమలు

కేటీపీఎస్ బూడిదను ఉచితంగా తీసుకెళ్లి ఉపాధి అవకాశాలు పొందేందుకు యువతకు సహకరిస్తామని గతంలో ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీంతో వేల సంఖ్యలో సిమెంట్ ఇటుకల ఫ్యాక్టరీలు ప్రారంభమయ్యాయి. బూడిదకు ధర నిర్ణయించడంతో నష్టాలు వస్తున్నాయంటూ చాలా మంది పరిశ్రమలను మూసేశారు. ప్రస్తుతం టన్ను బూడిదకు రూ.50 చొప్పున ఇస్తుండగా.. తక్కువ మందే తీసుకెళుతున్నారు. ఇప్పటికైనా ఉచితంగా తీసుకెళ్లే అవకాశం ఇస్తే తప్ప నిల్వలు ఖాళీ అయ్యే పరిస్థితి లేదని స్థానికులు అంటున్నారు.

కొత్త ప్లాంట్ నిర్మించేదెలా..?

నూతన విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి భౌగోళిక పరిస్థితులు అనువుగా ఉన్నాయి. దీంతో థర్మల్ ప్లాంట్ ఏర్పాటుకు గల సాధ్యాసాధ్యాలపై డిజైన్ కంపెనీ ద్వారా త్వరలో సర్వే చేపట్టనున్నారు. అయితే యాష్‌పాండ్ మినహా మిగితా వన్నీ అనుకూలంగానే ఉన్నాయని అంటున్నారు. ప్రస్తుత బూడిద చెరువు 450 ఎకరాల్లో ఉండగా 800 మెగవాట్ల ప్లాంట్లు రెండు నిర్మిస్తే మరో 200 ఎకరాల్లో యాష్ పాండ్ ఏర్పాటుతో పాటు ప్రస్తుత బూడిదను ఖాళీ చేయించాల్సి ఉంటుంది. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి నిల్వ ఉన్న బూడిదను ఖాళీ చేయించాలని పలువురు కోరుతున్నారు.

యాజమాన్యం పరిధిలో ఉంది



కాంప్లెక్స్‌లో పరిధిలోని నాలుగు పాండ్‌లూ నిండిపోయాయి. సుమారు 10 కోట్ల టన్నుల బూడిద పేరుకుపోయినట్లు అంచనా. కొత్త ప్లాంట్ నిర్మిస్తే నాలుగూ చెరువుల్లోనూ నిల్వ ఉన్న బూడిదను తీయించాలి. ఈ విషయాన్ని జెన్‌కో యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లాం.
– ఎం.ప్రభాకర్ రావు, సీఈ

నిబంధనలకు కట్టుబడిన వారికే పీఠం

- రాజ్యాంగ హక్కుల పరిరక్షణే లక్ష్యం
- ఏఐసీసీ పరిశీలకుడు జాన్సన్ అబ్రహం



కొత్తగూడెంలో మాట్లాడుతున్న జాన్సన్ అబ్రహం, పక్కన ఎంపీ రఘురాంరెడ్డి, పొదెం వీరయ్య తదితరులు

కొత్తగూడెంఅర్బన్/ఇల్లెందు : ఆరేళ్లుగా కాంగ్రెస్‌లో ఉంటూ బూత్ స్థాయి కార్యకర్తల వరకు పరిచయం ఉంటూ కాంగ్రెస్ నిబంధనావళికి అనుగుణంగా ఉన్నవారికే డీసీసీ అధ్యక్ష పదవి లభిస్తుందని ఏఐసీసీ పరిశీలకులు జాన్సన్ అబ్రహం అన్నారు. బుధవారం ఆయన ఇల్లెందు, కొత్తగూడెంలో నిర్వహించిన సమావేశాల్లో మాట్లాడారు. కష్టపడి పనిచేసే వారికే పదవులు కట్టబెట్టాలనే రాహుల్ గాంధీ పిలుపు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రాజ్యాంగ హక్కుల పరిరక్షణే కాంగ్రెస్ లక్ష్యమని, అందుకోసమే రాహుల్‌గాంధీ దేశమంతా యాత్రలు చేపట్టారని చెప్పారు. డీసీసీ అధ్యక్ష పదవి కోసం వచ్చిన దరఖాస్తులన్నింటినీ అధిష్టానానికి అందజేస్తామని, కార్యకర్తలు, నాయకుల నుంచి తాము సేకరించిన అభిప్రాయాలను కూడా ఢిల్లీ స్థాయిలో చర్చించి, కులమతాలకు అతీతంగా అర్హులైన వారిని అధ్యక్ష పదవికి ఎంపిక చేస్తామని వివరించారు. భద్రాద్రి జిల్లా ఎంతో ఆదర్శవంతమైనదని, రాష్ట్రంలో పార్టీ అధికారంలోనికి రావడానికి ఇక్కడి నాయకులు, కార్యకర్తలు ఎంతో కష్టపడ్డారని గుర్తు చేశారు. ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి మాట్లాడుతూ.. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు ముందు కలిసికట్టుగా పనిచేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల కృషిని ఎప్పటికీ మరువబోమని అన్నారు. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. డీసీసీని బలోపేతం చేసేందుకు గ్రామ స్థాయి నుంచి అభిప్రాయాలు అందించి సహకరించాలని కోరారు. ఆయా సమావేశాల్లో డీసీసీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య, టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు, టీపీసీసీ పరిశీలకులు ఈద్పుగంటి సుబ్బారావు, నాయకులు సాగరిక, సంజీవ్, ధర్మారావు, మహ్మద్ ఖాన్, నాగేందర్‌రెడ్డి, జేబీ శౌరి, ఆళ్ల మురళి, ఎడవల్లి కృష్ణ, తూము చౌదరి, కోనేరు సత్యనారాయణ, ఎన్. దుర్గాప్రసాద్, తోట లక్ష్మీ ప్రసన్న, రవి, ఏలూరి కోటేశ్వరరావు, యదల్లపల్లి అనసూర్య, బానోతు రాంబాబు, భూక్యా దళ్‌సింగ్ నాయక్, పులి సైదులు, డానియేల్ పాల్గొన్నారు.

అందరికీ పోషకాహారం అందించాలి

డీడబ్ల్యూఓ స్వర్ణలతా లెనీనా



మాట్లాడుతున్న స్వర్ణలతా లెనీనా

అశ్వారావుపేటరూరల్: అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న లబ్ధిదారులందరికీ క్రమం తప్పకుండా పోషకాహారం అందేలా సిబ్బంది కృషి చేయాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారిణి(డీడబ్ల్యూఓ) స్వర్ణలతా లెనీనా అన్నారు. అశ్వారావుపేట రైతువేదికలో బుధవారం నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ముందుగా సిబ్బంది ప్రదర్శించిన పోషకాహారం, చిరు ధాన్యాల స్టాళ్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని, పోషకాలు అధికంగా ఉండే వాటికే ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి రాందాస్‌నాయక్ మాట్లాడుతూ.. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవం చేయించుకునేలా అంగన్‌వాడీ సిబ్బంది అవగాహన కల్పించాలని కోరారు. పోషణ లోపం ఉన్న పిల్లలను ఎన్ఆర్‌సీ కేంద్రాలకు పంపించాలని అన్నారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు, తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీఓ అప్పారావు, సీడీపీఓ ముత్తమ్మ, ఏసీడీపీఓ అలేఖ్య, సూపర్‌వైజర్లు వరలక్ష్మి, రమాదేవి, సౌజన్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

హెచ్‌ఎంకు రాష్ట్రస్థాయి పురస్కారం



ప్రశంసా పత్రం అందుకుంటున్న హెచ్‌ఎం శ్రీనివాసరావు

దుమ్ముగూడెం: మండలంలోని నర్సాపురం జిల్లా పరిషత్ పాఠశాల హెచ్‌ఎం బెక్కంటి శ్రీనివాసరావుకు రాష్ట్రస్థాయి పురస్కారం లభించింది. ఇన్ఫోసిస్, సీఎస్సార్ నిధులతో విద్యార్థులకు కంప్యూటర్ ల్యాబ్‌ను, వాష్ బేషిన్ ఏర్పాటు చేశారు. 15 సంవత్సరాలుగా పాఠశాల ఆవరణలో ఉన్న బావిలో పూడిక తీయించి మోటార్ ఏర్పాటు చేయడంతోపాటు వివిధ రకాల మొక్కలు నాటించారు. పాఠశాల అభివృద్ధికి చేస్తున్న కృషికి గుర్తింపుగా హైదరాబాద్‌లోని డైరెక్టర్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ప్రశంసా పత్రం అందజేశారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఏఎస్పీ నరేందర్



పంపిణీకి సిద్ధంగా ఉన్న నిత్యావసరాలు

చర్ల: ఆదివాసీలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఏఎస్పీ (ఆపరేషన్స్) నరేందర్ అన్నారు. మండలంలోని మారుమూల అటవీ ప్రాంత గ్రామం ఎర్రంపాడులో బుధవారం ఆయన భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్‌తో కలిసి 250 కుటుంబాలకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ఆదివాసీలకు పోలీసుశాఖ తరఫున అన్ని సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సీఆర్‌పీఎఫ్ 141 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ వివేక్‌రంజన్, చర్ల సీఐ రాజువర్మ, ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల రక్షణకు సిబ్బంది



ఈఓ దామోదర్‌రావుతో పోలీస్ సిబ్బంది

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానానికి వచ్చే భక్తుల రక్షణకు తెలంగాణ టూరిజం శాఖ ఏడుగురు సభ్యులతో కూడిన పోలీస్ సిబ్బంది నియమించింది. సిబ్బంది బుధవారం నుంచి విధులకు హాజరయ్యారు. ముందుగా ఆలయ ఈఓ దామోదర్‌రావును కలువగా ఆయన వారికి విధులను కేటాయించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

కోడి పుంజులు చోరీ

అశ్వారావుపేటరూరల్: ఖరీదైన పందెం కోడి పుంజులను అపహరిస్తున్న దొంగలను గుర్తించిన గ్రామస్తులు బుధవారం ఒకరిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. ఎస్సై అఖిల కథనం ప్రకారం.. భద్రా చలంలోని జగదీశ్ కాలనీకి భార్యాభర్తలు కట్టా వెంకటేష్, వెంకటలక్ష్మి కలిసి అశ్వారావుపేట మండలంలోని పాత మామిళ్లవారిగూడెం గ్రామంలో మూడు కోడి పుంజులను చోరీ చేశారు. ఈ క్రమంలో కొందరు గ్రామస్తులు వారిని గమనించి వెంబడించారు. వెంకటేష్ పారి పోగా, భార్య వెంకటలక్ష్మిని పట్టుకుని చెట్టుకు కట్టేసి దేహశుద్ధి చేశారు. ఆ తర్వాత స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా, ఎస్సై అఖి ల చేరుకుని మహిళను అదుపులోకి తీసుకు ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం చోరీకి పాల్పడిన దంపతులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రిసార్ట్‌కు బాలికతో వచ్చిన యువకుడు?

యువకుడిని ఠాణాకు తరలించిన పోలీసులు?

ములకలపల్లి: మండల సరిహద్దులోని ఓ రిసార్ట్ గదిలో మైనర్ బాలిక ఓ యువకుడితో ఉండగా బంధువులు పట్టుకున్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ములకలపల్లి శివారులోని రిసార్ట్‌కు ఓ యువకుడు, ఉమ్మడి పూసుగూడెం పంచాయతీకి చెందిన మైనర్ బాలికను తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ క్రమంలో సమాచారం తెలుసుకున్న బాలిక బంధువులు రిసార్ట్‌కు చేరుకుని యువకుడిని ప్రశ్నించినట్లు సమాచారం. బాలికను అక్కడి నుంచి తీసుకెళ్లి కుటుంబీకుల వద్దకు చేర్చినట్లు తెలిసింది. విషయం వెలుగులోకిరాగా, ఘటనా ప్రదేశానికి వచ్చిన పోలీసులు వరంగల్ ఏరియాకు చెందిన యువకుడిని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై ఎస్సై మధుప్రసాద్‌ను వివరణ కోరగా.. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని తెలిపారు. రిసార్ట్ నిర్వాహకులను వివరణ కోరగా.. రిసార్ట్ చూసేందుకు ఇద్దరు వ్యక్తులు వచ్చారని, తాము ఎవరికీ గది కేటాయించలేదని పేర్కొన్నారు.

‘ఉపాధి’తో పశువుల షెడ్లు..

- ఈజీఎస్ జాబ్‌కార్డు ఉన్న రైతులు అర్హులు
- నాటు కోళ్ల పెంపకానికీ షెడ్ల నిర్మాణం

కరకగూడెం: కేంద్ర ప్రభుత్వం పశు సంపద పెంపకానికి తోడ్పాటునందిస్తోంది. ఉపాధి హామీ పథకం ద్వారా పశువుల షెడ్లు నిర్మించుకునే అవకాశం కల్పించింది. నాటు కోళ్ల పెంపకానికీ షెడ్లు నిర్మించుకోవచ్చు. జిల్లాలో మండలానికి 20 యూనిట్ల చొప్పున మంజూరుకాగా, ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. ఈ పథకం ద్వారా గతంలో నిర్మించిన షెడ్లను ఇటీవల నిర్వహించిన ‘పనుల జాతర’ కార్యక్రమంలో అధికారులు ప్రారంభించారు. ఆధునిక షెడ్లలో సరైన వెంటిలేషన్, పారిశుద్ధ్య సౌకర్యాలు ఉండటంతో పశువులు ఆరోగ్యంగా ఉంటాయి. వ్యాధుల బారిన పడే ప్రమాదం తగ్గుతుంది. షెడ్లలో మూత్రం శుభ్రం చేయడానికి ప్రత్యేక ఏర్పాట్లు కూడా ఉంటాయి.

ఇవీ నిబంధనలు

ఉపాధిహామీ జాబ్‌కార్డులు ఉన్న రైతులకు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. జిల్లా వ్యాప్తంగా 2.23లక్షల జాబ్‌కార్డులున్నాయి. షెడ్డు నిర్మాణా నికయ్యే వ్యయాన్ని ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వం 100శాతం చెల్లిస్తుంది. ఇందులో కూలీల వేతనం, నిర్మాణ సామగ్రి ఖర్చులు కలిపి ఉంటాయి. మేకలు, గొర్రెల, కోళ్ల షెడ్ల నిర్మాణానికి రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు మంజూరు చేస్తారు. షెడ్లు నిర్మించుకున్నాక అధికారులు బిల్లులు చెల్లిస్తారు. పంచాయతీ కార్యదర్శి/ఫీల్డ్ అసిస్టెంట్ వద్ద అప్లికేషన్ ఫారం తీసుకుని పేరు, జాబ్ కార్డు నంబర్, పశువుల సంఖ్య, భూమి తదితర వివరాలు స్పష్టంగా నమోదు చేయాలి. దరఖాస్తు సమర్పించాక క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలి స్తారు. అర్హులైతే అనుమతులు జారీ చేసి, ఉపాధి హామీ కింద పనులు ప్రారంభిస్తారు.



మోతె గ్రామంలో నిర్మించిన మేకల షెడ్డు

ఎంతో ప్రయోజనకరం



ఉపాధిపథకం ద్వారా షెడ్డు నిర్మించుకున్నాం. షెడ్డులో వెంటిలేషన్, పారిశుద్ధ్యానికి ఏర్పాట్లు కూడా ఉన్నాయి. మా జీవాల ఆరోగ్యం బాగుంది. రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వమే ఇచ్చింది.

–చిర్రా లక్ష్మి, లబ్ధిదారులు, మోతె గ్రామం, కరకగూడెం

సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధి హామీ పథకంలో పశువుల షెడ్ల నిర్మాణాన్ని రైతులు సద్విని యోగం చేసుకోవాలి. దరఖాస్తు ప్రక్రియ సులభతరం చేశాం. మెరుగైన షెడ్ల ద్వారా పశువుల ఆరోగ్యం బాగుంటుంది.

–విద్యాచందన, డీఆర్‌డీఓ

టీకాలతోనే గాలికుంటు వ్యాధి నివారణ

జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు



పశువుకు గాలికుంటు నివారణ టీకా వేస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

పాల్వంచరూరల్: పశువులకు సమయానికి టీకా వేస్తే గాలికుంటు వ్యాధిని నివారించవచ్చని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ నెల 15 నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు 7వ విడత గాలికుంటు వ్యాధి నివారణ ఉచిత టీకా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. బుధవారం మండలంలోని సోములగూడెం గ్రామంలో పశువులకు టీకా వేసి జిల్లా పశుసంవర్ధకశాఖ అధి కారి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి సోకితే పశువుల్లో ఉత్పాదక శక్తి, పునరుత్పత్తి సామర్థ్యం తగ్గిపోతుందన్నారు. జిల్లాలో మొత్తం 3.71లక్షల ఆవులు, గేదెలు, ఎద్దులు, దూడలు ఉన్నాయని తెలిపారు. అన్ని మండలాల్లో టీకాలు వేస్తామని పేర్కొన్నారు. ఇందుకోసం జిల్లాలో 60 బృందాలను ఏర్పాటు చేశామన్నారు. రోజూ ఉదయం పశువులకు టీకాలు వేసి భారత్ పశుధాన్ పోర్టల్‌లో వివరాలను నమోదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉప సంచాలకులు డాక్టర్ సత్యప్రసాద్, మండల పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జి.రమేష్, గోపాల మిత్రలు మహ్మద్ సాబీర్ పాషా, షేక్ అస్గర్, రాధారామ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో శిక్షణ పొందాలి

కలెక్టర్ జితేష్ వి.పాటిల్



భవనాలను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్, పీఓ రాహుల్ తదితరులు

పాల్వంచ/భద్రాచలంటౌన్: విద్యార్థులు క్రీడల్లో శిక్షణ పొందాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. బుధవారం ఆయన సోషల్ వెల్ఫేర్ గర్ల్స్ కళాశాలలో బాస్కెట్‌బాల్ ట్రైనింగ్‌ను ప్రారంభించారు. విద్యార్థినులతో ముచ్చటించారు. భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలోని భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లాలో బాస్కెట్ బాల్ అభివృద్ధికి ముంబైకి చెందిన హెచ్‌ఐ-5 ఫౌండేషన్ ముందుకు వచ్చిందన్నారు. క్రీడా మెటీరియల్, సపోర్టింగ్ కోచింగ్ సిబ్బందిని ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేస్తామన్నారు. ఐటీడీఏ ప్రాంగణంలోని నిరుపయోగ భవనాలను వినియోగంలోకి తేవాలని, భవనాల్లో సౌకర్యాల కల్పనకు ఈనెల 31 వరకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గిరిజనుల నుంచి సేకరించే అటవీ ఫలాలను జీసీసీ కొనుగోలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ బి.రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, జిల్లా యువజన క్రీడా శాఖల అధికారి ఎం.పరంధామరెడ్డి, ఇతర అధికారులు డేవిడ్‌రాజ్, అశోక్, మధుకర్, చెంగల్‌రావు, రమేష్, సమ్మయ్య, ధనియాల వెంకటేశ్వర్లు, హరికృష్ణ ఫౌండేషన్ సభ్యుడు మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మైథిలి తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌పై అవగాహన పెంచేందుకే డ్రామా ఫెస్టివల్

డీఈఓ నాగలక్ష్మి

కొత్తగూడెంఅర్బన్: కళలతో సైన్స్‌పై అవగాహన పెంచుకునేందుకు డ్రామా ఫెస్టివల్ ఉపయోగపడుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి బి.నాగలక్ష్మి అన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి సైన్స్ డ్రామా ఫెస్టివల్ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డీఈఓ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ఎన్నో కళలు దాగి ఉంటాయని, వాటిని వెలికితీసి, పాఠ్య పుస్తకాల్లోని అంశాలను ఎలా నేర్చుకోవచ్చో తెలియజేసేలా డ్రామా ఫెస్టివల్ రూపొందించామని తెలిపారు. ఉత్తమ ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ప్రథమ బహుమతి పాల్వంచ త్రివేణి స్కూల్ విద్యార్థులు పొందగా, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా పాల్వంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, భద్రాచలం త్రివేణి స్కూల్ వారు సాధించారు. ఉత్తమ నటుడుగా గుండాల ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌కు చెందిన జి.రాహుల్ తేజ, ఉత్తమ నటిగా భద్రాచలం గౌతమ్ మోడల్ స్కూల్‌కు చెందిన హాసిని, ఉత్తమ దర్శకురాలిగా పాల్వంచ త్రివేణి పాఠశాలకు చెందిన రాజేశ్వరి, ఉత్తమ నాటక రచయితగా భద్రాచలం గౌతమ్ మోడల్ స్కూల్ కు చెందిన హాసిని ఎన్నికయ్యారు. కార్యక్రమంలో అకడమిక్ మానిటరింగ్ అధికారి కె.నాగరాజశేఖర్, సత్యనారాయణ, కృష్ణ పాల్గొన్నారు.

ప్రణాళిక సిద్ధం..

జిల్లాలోని ఉపాధ్యాయులు, విద్యాధికారులకు ఐదు రోజుల టీచర్ ఎక్స్‌పోజర్, ఎడ్యుకేషనల్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్ నిర్వహణకు ప్రణాళిక రూపొందించామని డీఈఓ నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ స్థాయి ఉత్తమ పాఠశాల విద్యా పద్ధతుల పరిజ్ఞానాన్ని, ఉపాధ్యాయులు, విద్యాధికారులకు అందించడం ద్వారా వారి వృత్తి నైపుణాలను అభివృద్ధి చేయడమే లక్ష్యమని తెలిపారు. ఇందుకోసం ఎంపిక చేసిన ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలను అక్టోబర్, నవంబర్ నెలల్లో సింగపూర్, ఫిన్‌లాండ్, వియత్నాం, జపాన్ దేశాల సందర్శనకు పంపిస్తామని తెలిపారు. 55 ఏళ్ల లోపు వయసు ఉండి, కనీసం పదేళ్ల సర్వీస్ పూర్తయిన వారి అర్హులని, 2026 మార్చి వరకు చెల్లుబాటయ్యే భారతీయ పాస్‌పోర్టు ఉండాలని, ఎలాంటి కేసులు లేని వారు, దీర్ఘకాలిక వ్యాధులు లేనివారు తమ దరఖాస్తులను ఈనెల 18వ తేదీ లోపు అందజేయాలని సూచించారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి

భద్రాచలంటౌన్: గిరిజన యువత ఐటీడీఏ అందిస్తున్న వృత్యంతర శిక్షణలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా వృద్ధి సాధించాలని ఐటీడీఏ ఏపీఓ డేవిడ్ రాజ్ అన్నారు. వరంగల్‌లో టీఎస్‌ఆర్‌టీసీ ఆధ్వర్యంలో జోనల్ డ్రైవింగ్ ట్రైనింగ్ కాలేజ్‌లో నిర్వహించే హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు ఎంపికైన గిరిజన యువకులతో ఆయన బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమయాన్ని వృథా చేయకుండా శిక్షణ పూర్తిచేసుకుని జీవితంలో స్థిరపడాలని చెప్పారు. కార్యక్రమంలో జేడీఎం హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని సుందరయ్య నగర్ కాలనీలో బుధవారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఒక్కసారిగా మంటలు అంటుకోవడంతో ఓ పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. కాగా అగ్ని ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది.

కొండచిలువ హతం

దుమ్ముగూడెం: మండలంలోని అంజుబాక క్రాస్ రోడ్డులో ఉన్న ఓ ఇంట్లో దూరిన కొండ చిలువను స్థానికులు చంపేశారు. మంగళవారం రాత్రి సమయంలో కొండ చిలువ ఇంట్లో దూరి కోళ్లను తినేందుకు చూస్తుండగా కోళ్లు బాగా అరవడంతో గమనించి హతమార్చారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

పాల్వంచ: లారీ, ఆటో ఢీకొన్న సంఘటనలో పలువురికి గాయాలయ్యాయి. బుధవారం నవభారత్ ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వేగంగా వచ్చిన ఆటో ఢీ కొట్టింది. దీంతో ఆటో డ్రైవర్‌కు తీవ్రంగా గాయాలయ్యాయి. ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 ద్వారా కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారి వివరాలు తెలియాల్సి ఉంది.

పార్లమెంట్‌లో బీసీ బిల్లు ఆమోదించాలి

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వెంకట్



ఏసీపీ విష్ణుమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వెంకట్ తదితరులు

జూలూరుపాడు: రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించి బీజేపీ చిత్తశుద్ధి నిరూపించుకోవాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ డిమాండ్ చేశారు. ఇటీవల మృతి చెందిన ఏసీపీ సబ్బతి విష్ణుమూర్తి కుటుంబాన్ని బుధవారం ఆయన వెంగన్నపాలెంలో పరామర్శించారు. విష్ణుమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జూలూరుపాడు సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో 42 శాతం బీసీ రిజర్వేషన్ ప్రతిపాదన వచ్చినా పార్లమెంట్‌లో చట్టం చేయకుండా మోదీ ప్రభుత్వం అడ్డుపడుతోందని విమర్శించారు. విద్యుత్ రెగ్యులేటరీ బిల్లుతో దేశంలోని విద్యుత్ రంగాన్ని ప్రైవేట్ సంస్థల చేతుల్లో పెట్టాలని కేంద్రం కుట్ర పన్నుతోందన్నారు. ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వమే యూరియా కొరతను సృష్టిస్తోందని ఆరోపించారు. విద్యుత్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా నవంబర్ 26న నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి యాసా నరేష్, గార్లపాటి వెంకటి, వల్లమల్ల చందర్‌రావు, బోడా అభిమిత్ర, బొల్లి లక్ష్మయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆర్టీసీ కానిస్టేబుల్‌కు గాయాలు

పాల్వంచ: రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. బుధవారం దమ్మపేట సెంటర్ వద్ద మోటార్‌సైకిల్‌పై కొత్తగూడెం వైపు వెళ్తున్న ఆర్టీసీ కానిస్టేబుల్ కొర్లపాటి వినీష్‌ను బొలెరో ట్రాలీ ఢీ కొట్టింది. దీంతో గాయాలుకాగా కొత్తగూడెం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయమై ఎస్‌ఐ సుమన్‌ను వివరణ కోరగా.. ఫిర్యాదు రాలేదని తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

భద్రాచలంఅర్బన్: వ్యక్తి అదృశ్యంపై బుధవారం కేసు నమోదైంది. పట్టణంలోని ఏఎస్‌ఆర్ కాలనీకి చెందిన రాజేష్ ఈ నెల 13న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల ఆరా తీసినా ఆచూకీ లేదు. అతడి తల్లి సరోజిని ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఏకలవ్య పాఠశాలలో విద్యార్థిని?

చర్ల: మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన ఓ విద్యార్థిని అదృశ్యమైనట్లు తెలిసింది. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సోయం మనస్విత బుధవారం రాత్రి 8 గంటల పాఠశాల నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం. దీంతో ఉపాధ్యాయులు విద్యార్థిని ఆచూకీ కోసం గాలింపు మొదలుపెట్టారు. ఈ విషయమై చర్ల పోలీసులకు కూడా పాఠశాల యాజమాన్యం సమాచారం ఇచ్చినట్లు చర్ల సీఐ తెలిపారు. కాగా ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్‌ను ఫోన్‌లో వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. అందుబాటులోకి రాలేదు.

66 గ్రాముల బంగారం స్వాధీనం

చోరీ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ విక్రాంత్ సింగ్ తదితరులు

చర్ల: మండలంలోని గాంధీనగరంలో ఈ నెల 8న జరిగిన భారీ చోరీ కేసును పోలీసులు ఛేదించారు. బుధవారం చర్ల పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ వివరాలను వెల్లడించారు. ఏఎస్పీ కథనం ప్రకారం.. సూరవీడుకు చెందిన ముత్యబోయిన ప్రేమ్‌చంద్ గొమ్ముగూడెం గ్రామ పంచాయతీ గాంధీనగరంలోని స్నేహితుడికి ఇంటికి వచ్చాడు. గాంధీనగరానికి చెందిన కోడిరెక్కల భాస్కర్‌రావు కుటుంబ సభ్యులు ఎవరూ ఇంట్లో లేని సమయంలో చోరీకి పాల్పడ్డాడు. ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న రూ.7.60 లక్షల విలువ చేసే 66.414 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ. 80 వేల నగదు అపహరించుకుపోయాడు. బాధితుడు ఈ నెల 10న ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం మండలంలోని సుబ్బంపేట శివారులో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా వెంకటాపురం వైపు నుంచి చర్లకు వస్తున్న ప్రేమ్‌చంద్ పోలీసులను చూసి పారిపోతుండగా వెండించి పట్టుకున్నారు. విచారించడంతో చోరీ విషయం వెల్లడించాడు. పోలీసులు బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. కేసును త్వరితగతిన ఛేదించిన సీఐ రాజువర్మ, ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ్‌లను ఏఎస్పీ అభినందించారు.

కల్వర్టు పైనుంచి పడి మహిళ మృతి



మెహబూబీ మృతదేహం

పాల్వంచ: మద్యం మత్తులో మహిళ కల్వర్టు పైనుంచి కింద పడి మృతి చెందిన సంఘటన బుధవారం వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. గతంలో పాల్వంచలో నివాసం ఉండి, ప్రస్తుతం విజయవాడలో ఉంటున్న షేక్ జానీ భార్య మెహబూబీ(35) డబ్బులు రావాల్సి ఉందంటూ పది రోజుల క్రితం పాల్వంచ వచ్చింది. అప్పటి నుంచి జయమ్మ కాలనీలో సోదరుడి ఇంటి వద్ద ఉంటోంది. డబ్బులు తీసుకుని విజయవాడ వెళ్తానంటూ మంగళవారం సాయంత్రం అక్కడి నుంచి బయటకు వెళ్లింది. అనంతరం కుంటినాగుల గూడెం సమీపంలో మద్యం తాగి అక్కడే స్థానికులతో కొంత సేపు గొడవ పడింది. ఆ తర్వాత రోడ్డు మూలమలుపు వద్ద పడిపోయింది. అటుగా వెళుతున్న ఓ లారీ డ్రైవర్, క్లీనర్ రాత్రి 11 గంటల సమయంలో గమనించి, ఆమెను వాహనాలు తొక్కి వెళ్లే ప్రమాదం ఉందని లేపి, పక్కనే ఉన్న కల్వర్టుపై కూర్చోబెట్టి వెళ్లిపోయారు. కొద్ది సేపటి తర్వాత మత్తులో ఉండి కల్వర్టు పైనుంచి కింద పడింది. దీంతో తలకు బలమైన గాయాలు కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. బుధవారం సాయంత్రం స్థానికుల సమాచారంతో వచ్చి పోలీసులు బయటకు తీశారు. అయితే అప్పటికే మృతి చెందింది. ఈ విషయమై ఎస్‌ఐ సుమన్‌ను వివరణ కోరగా.. మద్యం మత్తులో కల్వర్టు పైనుంచి కిందపడి మృతి చెందినట్లు సీసీ కెమెరా ఫుటేజీ ద్వారా గుర్తించామని తెలిపారు. ఫిర్యాదు వచ్చాక కేసు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

పోస్ట్‌మాస్టర్ ఆత్మహత్యాయత్నం

ఇల్లెందురూరల్: మండలంలోని ముత్తారపుకట్ట పోస్ట్‌మాస్టర్ మౌనిక మంగళవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగింది. గమనించిన ఇరుగుపొరుగు ఆమెను ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించగా, ఆరోగ్యం మెరుగుపడిందని కుటుంబ సభ్యులు చెప్పారు. మౌనికను పోస్టల్‌శాఖ అధికారులు, సిబ్బంది బుధవారం పరామర్శించారు. కాగా కుటుంబ సమస్యల వల్లే తాను ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు పోస్ట్ మాస్టర్ మౌనిక తెలిపారు.

దుమ్ముగూడెంలో మరొకరు ...

దుమ్ముగూడెం: మండలంలోని రేగుబల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ బుధవారం ఆత్మహత్యకు యత్నించింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. రేగుబల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడు, యువతి నాలు గేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. సదరు యువతి ప్రస్తుతం నాలుగునెలల గర్భవతి. యువకుడు పెళ్లికి నిరాకరించడంతో ఆమె తల్లితో కలిసి న్యా యం కోసం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లింది. అక్కడ కౌన్సెలింగ్ చేస్తున్న క్రమంలో తనకు గతంలోనే వివాహమైందని తెలిపాడు. ఈక్రమంలో యువకుడిపై కేసు నమోదు చేసేందుకు యువతి వయసు ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని సూచించారు. దీంతో ఇరువర్గాల వారు తిరిగి ఇంటికి వెళ్లిపోయారు. ఆ తర్వాత అవమానభారంతో యువతి తల్లి ఇంట్లో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ఇల్లెందురూరల్: మండలంలోని సుభాష్‌నగర్‌కు చెందిన సాగిని నర్సింహారావు ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్ హైదరాబాద్ టీం-1, సివిల్ సప్లయీస్ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. 11 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేసి, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఇల్లెందు సివిల్ సప్లయీస్ డీటీ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

చర్ల: మండలంలోని బెస్త కొత్తూరుకు చెందిన గుమ్ముల నరేష్ గత నెల 30న భార్యతో గొడవ పడి మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. దీంతో కుటుంబ సభ్యులు భద్రాచలం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమించి బుధవారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతుడి తల్లి గుమ్ముల లక్ష్మి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసు నమోదు

కొత్తగూడెంటౌన్: బాలికను వేధించిన వ్యక్తిపై బుధవారం టూటౌన్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. సీఐ ప్రతాప్ కథనం ప్రకారం.. రామవరం నాగయ్యగడ్డ బస్తీకి చెందిన పల్లపు సాగర్ అదే ప్రాంతానికి చెందిన మైనర్ బాలికను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని వేధించాడు. ఒప్పుకోకపోతే చంపివేస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ప్రతాప్ తెలిపారు.

కాపర్ వైరు చోరీ

కరకగూడెం: మండలంలోని భట్టుపల్లి గ్రామం వీరాపురం క్రాస్ సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. రూ. 40 వేల విలువైన కాపర్ తీగను చోరీ చేశారు. బుధవారం ఇన్‌చార్జ్ ఏఈ రాజశేఖర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి



విద్యుదాఘాతంతో మృతి చెందిన ఎద్దు

జూలూరుపాడు: మండలంలోని గంగారంతండాకు చెందిన రైతు ఆంగోత్ కృష్ణకు సంబంధించిన దుక్కిటెద్దు విద్యుదాఘాతంతో బుధవారం మృతి చెందింది. మేత కోసం పొలంలో వదలగా ఎద్దు ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకడంతో విద్యుదాఘాతానికి గురైంది. సుమారు రూ. లక్ష నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

కాపర్ వైర్ దొంగ పరారీ

జూలూరుపాడు: పంట పొలాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టి కాపర్ వైర్‌ను చోరీకి పాల్పడిన దొంగ పరారీలో ఉన్నాడని జూలూరుపాడు ఎస్‌ఐ బాదావత్ రవి బుధవారం తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. 2010లో పలు గ్రామాల్లోని పంటపొలాల్లో ఏర్పాటు చేసుకున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కొత్తగూడెం అశోక్‌నగర్‌కు చెందిన లారీ క్లీనర్ తమ్మయ్య నాయుడు శ్రీరామ్ కాపర్ వైర్ అపహరించాడు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కొద్ది రోజులు జైలు జీవితం గడిపిన తర్వాత నిందితుడు బెయిల్‌పై విడుదలయ్యాడు. కోర్టు నిబంధనలను ఉల్లఘించి వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. దీంతో కొత్తగూడెం అదనపుకోర్టు శ్రీరామ్‌కు నోటీసులు జారీచేసింది. నిందితుడి వివరాలు తెలిస్తే సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ కోరారు.

చోరీ కేసులో నిందితుడికి జైలు శిక్ష

మణుగూరుటౌన్/రూరల్: చోరీ కేసులో నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ మణుగూరు ప్రథమశ్రేణి జ్యుడీషియల్ కోర్టు మెజిస్ట్రేట్ కంభపు సూరిరెడ్డి బుధవారం తీర్పు వెలువరించారు. 2017, మార్చి 8న కె. సమ్మయ్య అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరగ్గా, బాధితుడు మణుగూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరిపి, కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఎనిమిది మంది సాక్షులను విచారించిన న్యాయమూర్తి.. నిందితుడు బత్తుల నర్సింహారావుకు ఆరు నెలల సాధారణ జైలు శిక్ష విధించారు. మరో నిందితుడు శివరాత్రి సంతోష్ కేసు విచారణలో ఉండగానే మృతిచెందాడు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ లావణ్య వాదించగా, కానిస్టేబుల్ బుచ్చిబాబు సహకరించారు.